తాతల.. ఏకాగ్రత..!



యువత, పిల్లలు, పెద్దలు చాలా వరకు వయసుతో సంబంధం లేకుండా చరవాణుల్లో నిమగ్నమై కాలక్షేపం చేస్తున్నారు. కానీ గతంలో తీరిక దొరికినా.. నలుగురు ఒక దగ్గర చేరినా సంప్రదాయ ఆటలు ఆడుతూ కనిపించేవారు. ఇప్పుడున్న వారికి ఆ కాలపు ఆటల పేర్లు కూడా తెలియడం లేదు. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామంలోని వృద్ధులంతా ఒకచోట చేరి పూర్వం ఆడే మేక,పులి ఆటను ఎంతో ఆసక్తిగా ఆడుతుండగా 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – న్యూస్‌టుడే, మర్రిగూడ

జిల్లాలో 22 సీసీఐ కేంద్రాలు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతులు పండించిన పత్తికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు భారత పత్తి సంస్థ జిల్లాలో గుర్తించిన 22 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. వానాకాలం మార్కెటింగ్ సీజన్ 2024-25కు ప్రభుత్వం పత్తికి మద్దతు ధర రూ.7521 ప్రకటించిందని వివరించారు. తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని వివరించారు. రైతులు దళారీలకు విక్రయించి నష్టపోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

మిర్యాలగూడ పట్టణం: జిల్లాలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండల పరిధిలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధికంగా ధాన్యం క్రయ విక్రయాలు జరుగుతాయని.. దీనిని దృష్టిలో ఉంచుకుని మొత్తం 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నామన్నారు. ఇప్పటికే 185 కేంద్రాలు ప్రారంభించగా.. 20 కేంద్రాల్లో ధాన్యం రాక సైతం మొదలైనట్లు తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం విక్రయించిన రైతులకు రూ. 500 బోనస్ అదనంగా ఇవ్వనున్నామన్నారు.

మూడు అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాలకు అనుమతి

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: యువతకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాలను పెంపొందింపజేసి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాల్లో ఈ సంవత్సరం నుంచే ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో నాలుగు కేంద్రాలకు నల్గొండ బాలుర ఐటీఐ, అనుముల, డిండి అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాలకు అనుమతి లభించింది. వచ్చే నెల నుంచి కళాశాలల్లో కోర్సులు ప్రారంభం కానున్నాయి. ఒక్కో కళాశాలలో 172 సీట్లకు గాను 6 కోర్సులను నిర్వహించనున్నారు. 4 కోర్సులు ఒక సంవత్సరానికి సంబంధించినవి ఉంటాయి. 2 కోర్సులు రెండు సంవత్సరాలకు సంబంధించినవి నిర్వహిస్తారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అంతకన్నా ఎక్కువ చదివినవారు సైతం అర్హులు. ఈనెల 30 లోగా పదోతరగతి, కులం ఇతర పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కేంద్రాల్లో చేరి శిక్షణ పూర్తి చేసినవారికి నూరు శాతం ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. కేంద్రాల పర్యవేక్షణకు నల్గొండ బాలుర ఐటీఐకి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, అనుముల కేంద్రానికి డీఈవో భిక్షపతి, డిండికి ఇంటర్మీడియట్ అధికారి దస్రునాయక్ నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారు. సీట్ల భర్తీకి అధికారులు పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు.

కార్యకర్తలపై దాడులు తగదు

నల్గొండ అర్బన్: నకిరేకల్ నియోజకవర్గంలో భారాస కార్యకర్తలపై ఇటీవల దాడులు పెరుగుతున్నాయని జడ్పీ మాజీ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని భారాస కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. దసరా రోజు కేతేపల్లిలో ముగ్గురు వ్యక్తులు ఇంటి ముందు కూర్చొని ఉండగా కాంగ్రెస్ కార్యకర్తలు అకారణంగా కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారని.. దీనిపై సంబంధిత స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టింపు లేదని ఆరోపించారు.

విద్యుత్తుశాఖ ఎస్ఈగా వెంకటేశ్వర్లు

నల్గొండ జిల్లా పరిషత్తు: విద్యుత్తుశాఖ నల్గొండ సర్కిల్ ఎస్ఈగా ఎ.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన పాల్‌రాజ్‌ను ప్రభుత్వం విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎంఆర్టీఈ డీఈ రవిప్రసాద్ ఇన్‌ఛార్జి ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా నిర్వహించిన బదిలీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్ఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు నల్గొండకు స్థాన చలనం కల్పించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, ఇంజినీర్లు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికారు.

డీసెట్-2024 వెబ్‌కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: వెబ్‌కౌన్సెలింగ్ డీసెట్-2024 విడుదలైందని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) నల్గొండ ప్రధానాచార్యులు నర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో డైట్ నల్గొండ నందు సర్టిఫికెట్లు ధ్రువీకరించుకోని అభ్యర్థులకు ఈనెల 21 వరకు అవకాశం ఉందని తెలిపారు. 23 నుంచి 26వ వరకు డీఈఈసెట్-2024లో సాధించిన ర్యాంకు ప్రకారం వెబ్ ఆప్షన్ల నమోదు, ఈనెల 30న మెరిట్ అండ్ రోస్టర్ ప్రకారం సీట్ల కేటాయింపు, ఈనెల 30 నుంచి నవంబర్ 3వ వరకు ఫ్రీ పేమెంట్, అడ్మిషన్ కేటాయింపు, నవంబర్ 4న కళాశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

రెండు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి, న్యూస్‌టుడే: మూసీ ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌లోకి వరదనీరు వస్తుంది. రిజర్వాయర్ నీటిమట్టం గరిష్టస్థాయికి చేరడంతో అధికారులు డ్యాం రెండు క్రస్టుగేట్లను ఎత్తి దిగువమూసీలోకి నీటిని విడుదల చేశారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా శుక్రవారం రాత్రి వరకు 644.33అడుగుల గరిష్టస్థాయికి నీటిమట్టం పెరిగింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిలువ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా శుక్రవారం రాత్రివరకు రిజర్వాయర్‌లో 4.29 టీఎంసీల నీరు నిలువ ఉంది. ప్రధాన కుడి, ఎడమ కాలువలద్వారా 365 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని డ్యామ్ ఇంజినీర్ డి.ఉదయ్‌కుమార్ తెలిపారు.

పట్టాలు లేక.. కష్టాలు..!



వలిగొండ: అక్కంపల్లి సమీపంలో అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా టార్పాలిన్లు (పట్టాలు)

న్యూస్‌టుడే పరిశీలన


భువనగిరి–వలిగొండ, న్యూస్‌టుడే: ఏటేటా ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా.. ఆ మేరకు మౌలిక సదుపాయాల కల్పనలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. రైతులకు కనీసం మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా.. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా కొనుగోళ్లు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నా.. సదుపాయాలు కొరవడి ఆర్థికంగా రైతులు నష్టపోతున్నారు.

● పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ మౌలిక సదుపాయాలను సమకూర్చాల్సి ఉంది. మౌలిక సదుపాయాలను పూర్తిగా సమకూర్చడంలో ఆ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మౌలిక సదుపాయాలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పౌర సరఫరాల సంస్థ ప్రతి సీజన్‌లో ఆయా జిల్లాల మార్కెటింగ్ శాఖకు రూ.కోట్లలో మార్కెట్ రుసుము చెల్లిస్తున్నా.. కనీస సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టడం లేదు.

కోతలు ప్రారంభమై.. కేంద్రాలు తెరుస్తున్నా...

వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి చాలా చోట్ల చేతికి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక ప్రారంభమైంది. తేమ శాతం అధికంగా ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబెట్టుకుంటున్నారు. కానీ టార్పాలిన్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం శుభ్రం చేసేందుకు ప్యాడీ క్లీనర్లు కూడా సరిగా లేవు. సరిగా పని చేయడం లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో జిల్లాలో 75 శాతం కూడా లేవు. ఇక ధాన్యం తూర్పారబట్టే యంత్రాలు ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. తూకం యంత్రాలు సరిపడా లేవు. నూతన ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం తగ్గించేందుకు డ్రయర్లను కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేస్తేనే రైతులకు సౌకర్యంగా ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 2022-23లో పౌరసరఫరాల సంస్థ మార్కెటింగ్ శాఖకు చెల్లించిన ఆదాయం (కోట్లలో)



టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుంటున్నాం:

బోడపట్ల నర్సిరెడ్డి, వ్యవసాయ రైతు, సంగెం, వలిగొండ మండలం




కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు సరఫరా చేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద అద్దెకు తెచ్చుకోవాల్సి వస్తోంది. వర్షాలకు ధాన్యం తడిసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం సరఫరా చేయాలి. పదిహేను రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి.

ఇండెంట్ పెట్టాం:

సబిత, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, యాదాద్రి భువనగిరి

వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు కావాల్సిన యంత్రాలకు సంబంధించి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ఇండెంట్ పెట్టాం. టార్పాలిన్లు తక్కువగా ఉన్నా.. తెరిచిన కొనుగోలు కేంద్రాలకు ఇస్తున్నాం. ప్యాడీ క్లీనర్లు చాలా వరకు బాగానే ఉన్నాయి. 1,255 టార్పాలిన్లు, 365 విన్నోయింగ్ యంత్రాలు, 142 ప్యాడీ క్లీనర్లు, 170 తూకం యంత్రాలు అవసరమని లేఖ రాశాం.


ఉమ్మడి జిల్లాలో ప్రతిపాదించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు



మార్కెటింగ్ సమకూర్చాల్సిన సదుపాయాలు

జిల్లా	టార్పాలిను			ప్యాడీ క్లీనర్లు			తూకం మిషన్లు		
	అవసరం	ఉన్నవి	కావాల్సినవి	అవసరం	ఉన్నవి	కావాల్సినవి	అవసరం	ఉన్నవి	కావాల్సినవి
నల్గొండ	6500	6000	500	354	325	29	2000	1950	50
సూర్యాపేట	5500	5000	500	350	310	40	350	310	40
యాదాద్రి	4,845	3,567	1255	369	228	142	646	476	170

సమగ్ర కుల గణనకు సన్నాహాలు



నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమగ్ర సామాజికవర్గ(కుల) గణనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితో పాటు సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అంచనాకు వచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

అన్నింటికీ అవసరమే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కుల గణనకు హామీ ఇచ్చింది. ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అభ్యంతరాలు వస్తున్నాయి. ప్రధానంగా బీసీ గణన చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. గతంతో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. కుల గణన చేస్తే పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. త్వరలో నిర్వహించే సర్పంచి, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు ఇది ప్రామాణికం కానుంది.

సిబ్బంది నియామకానికి కసరత్తు

ఇంటింటి సర్వే చేసేందుకు సిబ్బంది (ఎన్యుమరేటర్లు) ఎంత మంది అవసరమో అంచనా వేస్తున్నారు. 60 రోజుల్లో గణన పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల్లో పనిచేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే ఎన్యుమరేటర్ల నియామకం పూర్తి చేయనున్నట్లు ప్రణాళిక అధికారులు పేర్కొంటున్నారు.

బీసీలను లెక్కించలేదు

ప్రతి పదేళ్లకోసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు ఇతర సందర్భాల్లో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల గణన చేపట్టలేదు. ఇది బీసీ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. 2011 జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా గుర్తించారు. బీసీల గణాంకాలు బయట పెట్టలేదు. నాటి నుంచి బీసీ సంఘాల నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉన్నత న్యాయ స్థానం సైతం బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఏఎమ్మార్పీ సీసీ లైనింగ్‌కు గ్రీన్‌సిగ్నల్

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జిల్లా వాసులకు ఇది తీపి కబురే. ఎస్ఎల్‌బీసీలో భాగమైన ఏఎమ్మార్పీ మెయిన్ కెనాల్ సిమెంట్ కాంక్రీటు(సీసీ) లైనింగ్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో నల్గొండ జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టు అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎస్ఎల్‌బీసీకి రూ.4,637 కోట్లు, ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ సీసీ లైనింగ్‌కు రూ.440 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించటంతో పలు సమస్యలు పరిష్కారం అయ్యేందుకు మార్గం సుగమమైంది.

■ ప్రధానంగా ఏఎమ్మార్పీ ఆయకట్టు రైతులు సాగు నీటి పంపిణీ సమస్యలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. కాల్వల్లో నీరు వెళ్తున్నా అవి చివరి వందల ఎకరాల వరకూ పారటంలేదు. ఇందుకు ప్రధానకారణం కాల్వలకు సీసీలైనింగ్ లేకపోవటమే. 133 కిలోమీటర్ల పొడవైన ప్రధాన కాల్వతో పాటు మరో 150 కిలోమీటర్ల పొడవైన మేజరు కాల్వలకు ఇప్పటి వరకూ సీసీలైనింగ్ చేయలేదు. దీంతో నీటి సీపేజీ సమస్య తీవ్రంగా ఉంది. నీటి వృథా తీవ్రమవటంతో చివరి భూములకు సాగునీరు సక్రమంగా వెళ్లని పరిస్థితి నెలకొంది.

■ వీటన్నింటికీ పరిష్కారం సీసీ లైనింగ్ చేయటమేనని భావిస్తూ, గత పాతికేళ్లలో పలుమార్లు సీసీ లైనింగ్‌కు ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. నీటిపారుదలశాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ ప్రతిపాదనలను పరిశీలించి నిధులను కేటాయించటం గమనార్హం. త్వరలోనే ఇందుకు సంబంధించిన జీవో కూడా విడుదలయ్యే అవకాశం ఉంది.



సిమెంటు కాంక్రీటు లైనింగ్ చేయనున్న ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ

నీటి వృథాకు చెల్లు..

కేవలం మట్టికాల్వల్లో నీరు వెళ్తే భూమిలోకి నీరు ఇంకిపోవటం, కాల్వలకు గండ్లు పడి తరచూ నీటి వృథా అవటం కాల్వలు కోతకు గురవటం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ముఖ్యంగా చెట్లపొదలు గుబురుగా పెరిగి కాల్వల్లో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. ప్రధానకాల్వ, మేజర్‌కాల్వలకు సీసీ లైనింగ్ చేయటంతో నీరు వేగంగా ప్రవహించి ఆయకట్టుకు చేరతాయి. తద్వారా నీటిపంపిణీ సరఫరా సులభమవుతుంది.

ఓటర్ల పెంపునకు కసరత్తు

ఉమ్మడి వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీకాలం ముగుస్తుండటంతో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించింది. గత నెల 30 నుంచి నవంబరు 6 వరకు ఓటు నమోదుకు గడువు ఉండగా.. ఇప్పటికే సంబంధిత ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూతన ఓటర్ల నమోదుపై దృష్టి సారించారు. ప్రత్యేకంగా సర్వీస్ కేంద్రాలు ఏర్పాటుచేసి ఓటు నమోదుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో ఓటుహక్కు ఉన్న వారు సైతం తిరిగి నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దిశగా ఓటరు జాబితా రూపకల్పనకు ఏర్పాట్లు చేపట్టాలని సూచిస్తున్నారు.

దరఖాస్తు ఇలా..

ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఫారం-19 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంది. ధ్రువపత్రాలతోపాటు అదనంగా గత ఆరేళ్ల నుంచి ఎక్కడ బోధిస్తున్నారనే వివరాలు పేర్కొనాలి. అందుకు సంబంధించి ధ్రువపత్రాలు సైతం జత చేయాల్సి ఉంది. పూరించిన దరఖాస్తులను జిల్లాలోని సంబంధిత ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల్లో అందజేయాలి. ఆన్‌లైన్‌లో ceo.telangana వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉపాధ్యాయ సంఘాల దృష్టి


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2019 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 7,243 మంది ఉన్నారు. దాదాపు 12 వేల మందికిపైనే ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులుండగా తక్కువ మంది ఓటు నమోదు చేసుకున్నారు. ఈ సారి ఓటర్ల సంఖ్య పెంచడానికి జిల్లా యంత్రాంగంతోపాటు ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా ఓటు నమోదుకు సర్వీస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరో 17 రోజులు మాత్రమే నమోదుకు అవకాశం ఉండటంతో ముమ్మరంగా అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2019లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు

జిల్లా	ఓటర్లు
నల్గొండ	3,859
సూర్యాపేట	2,156
యాదాద్రి	1228

నల్గొండ, విద్యావిభాగం, సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే

దర్గాకు బారులు



గద్దెల చుట్టూ నమాజ్ చేస్తున్న భక్తులు



అన్నదాన కేంద్రంలో భోజనాలు చేస్తూ..

సయ్యద్ షా లతీవుల్లా ఖాద్రీ దర్గా ఉర్సు దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం బారులు తీరారు. గుట్టపైకి వెళ్లలేని వారు గుట్ట కిందనే దీపాలు వెలిగించి నమాజ్ చేశారు. ఉర్సు సందర్భంగా వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేయడానికి పిల్లలు, పెద్దలు మెట్ల సమీపంలోని దుకాణాల వద్ద పోటీ పడ్డారు. భక్తులకు దాతలు అన్నదానం చేశారు. తాలూక్ దార్ మజీద్‌లో సామూహికంగా ఖురాన్ పఠనం చేశారు.

- నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే:

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్యాంకర్లు రుణ లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లా పూర్తిగా వ్యవసాయంపైన ఆధారపడినందున బ్యాంకర్లు పంట రుణాల లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో అందచేయాలన్నారు. నవంబరు 5 నాటికి నూరు శాతం ఇవ్వాలని చెప్పారు. వార్షిక పంట రుణాల్లో సైతం 50 శాతం లక్ష్యాలను సాధించాలని వివరించారు. వ్యవసాయ పంట రుణాలతో పాటు ఆర్థిక చేయూత యూనిట్లు తదితర వాటిని అమలు చేయడంలో బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్గొండ కలెక్టరేట్: తిరుమలగిరి సాగర్‌లో చేపట్టిన భూ సమస్యల పరిష్కారం పైలట్ ప్రాజెక్టులో చేపట్టిన క్షేత్రస్థాయి పనులన్నింటిని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రాజెక్టులో పని చేస్తున్న అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు మూడొంతు సర్వే పనులు పూర్తి అయ్యాయని వివరించారు. ఈనెల 24 వరకు పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పనులన్నీ ఈ నెల 30 వరకు పూర్తి చేయాలని కోరారు.

21 నుంచి అమరవీరుల వారోత్సవాలు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ఈనెల 21 నుంచి 31 వరకు జిల్లాలో నిర్వహించే పోలీస్ అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. 21న ఫ్లాగ్ డే, 22న ఓపెన్ హౌజ్, 23న పోలీసుల ప్రతిభపై అవగాహన సదస్సులు, 24న రక్తదాన శిబిరాలు, 26న సైకిల్ ర్యాలీ, వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిలిం ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గమ్మత్తులో యువత..!

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే:

ప్రజల ధన, మాన, ప్రాణాలను కబళించే కర్కశులను నియంత్రిస్తూ.. జనజీవన భద్రతను కంటికిరెప్పలా కాపాడాల్సిన బాధ్యత, పాలకులు, అధికారులపై ఉన్నదన్నది ఎంత సత్యమో.. అదే సమయంలో వారి పిల్లల ప్రవర్తనను, పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందనే విషయాన్ని గ్రహించాలి. అప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని ప్రముఖులు, నిపుణులు అవగాహన కల్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో లోపం కనిపిస్తోందని చెప్పొచ్చు.

☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గంజాయి చాపకింద నీరులా విస్తరిస్తోంది. దాని వాడకం యువతతో పాటు మైనర్లకు పాకుతోంది. దీనికి అలవాటు పడి కొందరు యువకులు, మైనర్లు ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. సరిహద్దు, కృష్ణపట్టె పరివాహక ప్రాంతం నుంచి గ్రామాలకు, పట్టణాలకు విస్తృతంగా సరఫరా అవుతోంది. పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ పూర్తిగా నిరోధించలేకపోతున్నారు. గంజాయి వాడకాన్ని తగ్గించాలంటే తమతోపాటు(పోలీసులు) తల్లిదండ్రుల పాత్ర కీలకమని వారు చెబుతున్నారు.



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024లో మిషన్ పరివర్తన్ కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చిన వారి సంఖ్య: 327

ఇందులో గంజాయి తాగటం మానేసిన వారి సంఖ్య: 321


డీఅడిక్షన్ కేంద్రంలో ఉన్నవారి సంఖ్య: 6

మచ్చుకు కొన్ని ఘటనలు..

☛ మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదివే బాలుడు వాళ్ల తరగతి ఉపాధ్యాయురాలితో 'నా మిత్రుడి ఇంట్లో గంజాయి ఉందట.. నన్ను రమ్మని పిలుస్తున్నాడు' అని చెప్పటంతో ఆ ఉపాధ్యాయురాలికి నోట మాట రాలేదు.

☛ రెండు నెలల క్రితం పట్టణంలోని రవీందర్‌నగర్‌లో పని చేసే ఓ మైనర్ వింత ప్రవర్తనతో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేశాడు. మైనర్ ఆగడాలను తట్టుకోలేక.. ఆ తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మైనర్‌ను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులకు, ఆత్మహత్య చేసుకుంటానని చాకుతో చేతిని కోసుకుని దగ్గరకు రాకుండా బెదిరించాడు. దీంతో మైనర్‌ను పోలీసులు పట్టుకుని వైద్య పరీక్షలు నిర్వహించగా.. గంజాయి తీసుకున్నట్లు తేలటంతో డీఅడిక్షన్ కేంద్రానికి పంపారు.

☛ సూర్యాపేట జిల్లా కేంద్రంలో గంజాయి మత్తులో కొందరు, ఓ యువకుడిని చావగొడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరలైంది. ఇలాంటి వెలుగులోకి రాని ఘటనలు కోకొల్లలు.



విచక్షణాజ్ఞానం కోల్పోతారు..

డాక్టరు మొయినుద్దీన్, మండల వైద్యాధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మిర్యాలగూడ



గంజాయికి అలవాటు పడితే వారిలో ఏకాగ్రత లోపిస్తుంది. రెండు, మూడేళ్లుగా వరుసగా తీసుకుంటే విచక్షణాజ్ఞానం కోల్పోతారు.. సైకోయిజం లక్షణాలు వస్తుంటాయి.





అవగాహన కల్పిస్తున్న రెండో పట్టణ వలయాధికారి నాగార్జున

అవగాహన కల్పిస్తున్నాం.. వీరబాబు, సీఐ, మిర్యాలగూడ గ్రామీణం

ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజలకు, అనుమానం వచ్చిన పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడికక్కడ నిఘా బృందాలతో తనిఖీ చేస్తున్నాం. ప్రజలంతా సహకరిస్తే వాడకాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం.

అతడు.. నిజంగా వీరుడే..!



వీరబాబు

కోదాడ, న్యూస్‌టుడే: చదువుకున్న యువకుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించాడంటే అతడి వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. అంతకు మించితే 40 లోపు ఉద్యోగం సాధిస్తుంటారు. అదే 40 దాటి ఉద్యోగం సాధిస్తే ఆశ్చర్య పడాల్సిందే. ఏకంగా 47 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు కోదాడకు చెందిన గూటి వీరబాబు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో సోషల్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి ఔరా అనిపించారు.

పది తప్పి.. పశువులు మేపి..

పదో తరగతి ఫెయిల్ కావడంతో ఏడాది పాటు పశువులు, మేకలు మేపారు. ఇంటర్ అతి కష్టం మీద పాసయ్యాడు. అనంతరం డిగ్రీ, బీఈడీ చదివారు. అనంతరం వివాహం, ఇద్దరు పిల్లలతో జీవనం గడపడం కష్టంగా మారింది. ఫొటోగ్రాఫర్‌గా పని చేసినా.. ప్రయోజనం లేదని తెలుసుకున్నాడు. ప్రభుత్వ కొలువు సాధిస్తేనే ఆ చదువుకు సార్థకత ఉంటుందని నమ్మి సాధన చేయడం మొదలుపెట్టారు.

★ గత 20 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడుతున్నారు. డీఎస్సీ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, గ్రూప్ ఉద్యోగాలు, రైల్వే, హాస్టల్ వార్డెన్ ఇలా 23 ఉద్యోగ పరీక్షలు రాశాడు. ఓ డీఎస్సీలో ఒక్క మార్కుతో ఉద్యోగం కోల్పోయారు. తాజా నోటిఫికేషన్‌లో ఏకంగా 4వ ర్యాంకు సాధించి ఆశ్చర్యపరిచారు. ఒక పూట ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ, మరో పూట పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయానికి వెళ్లి చదువును కొనసాగించారు. వయసు మీరినా ఉద్యోగం సాధించడంతో అందరికీ ఆదర్శంగా మారారు.

★ సరైనా ఉద్యోగం లేక, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గత పదేళ్లుగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడ్డానని వీరబాబు తెలిపారు. సోదరుడు 2006లోనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడంతో ప్రభుత్వ ఉద్యోగంపై మక్కువ పెరిగిందని, తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యుల సహకారంతో ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు.

★ వీరబాబు స్వగ్రామం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి అయినప్పటికీ గత 20 ఏళ్లుగా కోదాడ పట్టణంలో నివసిస్తున్నారు. పండగలకు స్వగ్రామానికి వెళితే ఏం చేస్తున్నావని, పదో తరగతి ఫెయిల్ అయిన వాడికి ఉద్యోగం ఎలా వస్తుందని, ఇంకా చదువు ఏంటనీ బంధువులు, స్నేహితులు హేళన చేసేవారని ఆయన చెప్పారు. దీంతో గ్రామానికి వెళ్లడం కూడా మానేశానని వివరించారు. ఇంటి అద్దె, పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సి వచ్చేదని, కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతోనే ఉద్యోగ కల నెరవేరిందన్నారు. గతంలో మాట్లాడటానికే చులకనగా చూసిన బంధువులు, స్నేహితులు ఇప్పుడు ఫోన్లు చేసి అభినందించడం ఆనందంగా ఉందని తెలిపారు.

పాత వీసీకే... పట్టం



ప్రొ.అల్తాఫ్ హుస్సేన్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నూతన వీసీగా ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో 2016 నుంచి 2019 వరకు ఇదే వర్సిటీకి వీసీగా పనిచేశారు. వర్సిటీలో రెండు పర్యాయాలు స్నాతకోత్సవం నిర్వహించిన ఘనత సైతం ఈయనకే దక్కింది. వర్సిటీకి ఇప్పటి వరకు ప్రొ.గంగాధర్, ప్రొ.కట్టా నర్సింహారెడ్డి, ప్రొ.అల్తాఫ్ హుస్సేన్, ప్రొ.గోపాల్‌రెడ్డి రెగ్యులర్ వీసీలుగా పనిచేశారు. ఎంజీయూ వీసీ పోస్టు కోసం ఎంతో మంది ఆశావహులు పోటీ పడ్డా.. చివరికి అల్తాఫ్ హుస్సేన్‌కే పదవి వరించింది. ఐదో వీసీగా ఈయన త్వరలోనే పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. వర్సిటీకి నూతన వీసీ రానున్న నేపథ్యంలో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారంతో పాటుగా వర్సిటీలో అభివృద్ధి మరింత వేగం అవుతుందని భావిస్తున్నారు. నూతన వీసీకి ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ టూ వీసీ కె.అంజిరెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.

నేటి చిత్రం



జలబంధం..

గడ్డిపూల అందం

హాలియా వద్ద ప్రవహిస్తున్న వరద కాలువలో గడ్డి ఏపుగా పెరిగింది. అది కాలువ మొత్తం విస్తరించింది.. పైగా తెల్లటి గడ్డిపూలతో దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది.. ఈ గడ్డి మధ్యలో నుంచే నీటి ప్రవాహం సాగుతోంది.

- ఈనాడు, నల్గొండ



శిక్షణ పొందుతున్న యువత (పాతచిత్రం)

ఉపాధికి శిక్షణ..

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ బాటలు వేస్తూ వారిలో కొత్త వెలుగులు నింపుతోంది మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థ. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదవలేక, చదివిన చదువుకు ఉపాధి, ఉద్యోగాలు లేక నిరాశతో నిరుద్యోగులుగా మారిన యువతకు ఉపాధి మార్గం వేస్తోంది. స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలున్న కంప్యూటర్, ఎలక్ట్రిషియన్, సోలార్, టైలరింగ్, సెల్‌ఫోన్ మరమ్మతులు, ద్విచక్ర వాహనాల మరమ్మతులు వంటి పలు కోర్సుల్లో వసతి కల్పించి శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ అనంతరం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తూ కచ్చితమైన ఉద్యోగ అవకాశాలను సంస్థ కల్పిస్తోంది. ఇటీవల ద్విచక్ర వాహన మరమ్మతు కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసుకొని ఉద్యోగాలు చేస్తున్న యువత అభిప్రాయాలు వారి మాటల్లోనే.

సంస్థ ఉపాధి మార్గం చూపించింది

- ప్రణీత్, మెదక్



నేను డిప్లొమా మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాను. చదువుకు తగ్గట్టుగా సరైన ఉద్యోగం లభించలేదు. స్నేహితుల ద్వారా సంస్థ గురించి తెలుసుకున్నాను. ఆటోమొబైల్ మరమ్మతు కోర్సులో ప్రవేశం పొందాను. శిక్షణ అనంతరం సికింద్రాబాద్‌లోని రాం హోండా మోటర్స్‌లో ఉద్యోగం సాధించాను. నెలకు రూ.14 వేల వేతనం పొందుతున్నాను.

ఉగ్యోగానికి తగ్గట్టుగా..



- నరేష్, వనపర్తి

నేను ఇంటర్ చదివాను. సంస్థలో స్వల్పకాలిక కోర్సులైనా ఉద్యోగానికి తగ్గట్టుగా అవసరమైన అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ద్విచక్ర వాహన మరమ్మతు కోర్సులో శిక్షణ పొందాను. సంస్థ చేపట్టిన ప్రాంగణ ఎంపికల్లో సుశీల్ టీవీఎస్ కూకట్‌పల్లిలో టెక్నిషియన్‌గా ఉద్యోగం సంపాదించాను. నెలకు రూ.13వేల వేతనం పొందుతున్నాను.

కచ్చితమైన ఉపాధి అందించడమే లక్ష్యం

- అయోధ్య, శిక్షకుడు ఎస్ఆర్టీఆర్ఐ



ఉన్నత చదువులు చదువుకోలేక పోయిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలున్న కోర్సుల్లో శిక్షణ అందించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే సంస్థ లక్ష్యం. నిరుద్యోగ యువత ఖాళీగా సమయాన్ని వృథా చేయకుండా సంస్థ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలి.



కళావేదికపై నృత్య ప్రదర్శన

కళా వేదికపై కూచిపూడి నాట్యం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం నృత్య ప్రదర్శన జరిగింది. ఆధ్యాత్మిక ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే ఉద్దేశంతో దేవస్థానం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో హైదరాబాద్, హన్మకొండలకు చెందిన అర్చన నృత్యనికేతన్, హంపీ కళా నిలయం బృందాలు వేర్వేరుగా కూచిపూడి నాట్య ప్రదర్శనలు జరిగాయి.

వసూలు చేసి.. వదిలేసి..!

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పంచాయతీల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలపై సందిగ్ధత ఏర్పడింది. వీటి నిర్మాణాల కోసం నాలుగున్నరేళ్ల క్రితం ఒక్కో పంచాయతీ నుంచి రూ.20 వేలు డీడీలు తీసుకున్నారు. ఇప్పటి వరకు డబ్బులు తిరిగి ఇవ్వలేదు.

పంచాయతీలు చెల్లించిన డబ్బులు (రూ.లలో)

జిల్లా	పంచాయతీలు	చెల్లించిన డబ్బులు
నల్గొండ	844	1.68 కోట్లు
సూర్యాపేట	475	95 లక్షలు
యాదాద్రి	421	84.20 లక్షలు

సామూహిక మరుగుదొడ్లను మంజూరు చేస్తామని గతేడాది కేంద్రం ప్రకటించింది. దీంతో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు ఆ డబ్బులను తిరిగి చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం మరుగుదొడ్లను మంజూరు చేస్తుందా లేక పంచాయతీలకు డబ్బులు తిరిగి చెల్లిస్తుందా అనేది సందిగ్ధంగా మారింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రతి గ్రామంలో సామూహిక మరుగుదొడ్డి నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలు వాటాగా పదిశాతం చెల్లించాలని సూచించారు. 1740 పంచాయతీలు రూ.3.48 కోట్లు చెక్కులు, డీడీలు చెల్లించాయి. కొన్ని పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించి మధ్యలో నిలిపివేశారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఉపయోగకరం... పంచాయతీలు కట్టిన డబ్బులు గ్రామీణ అభివృద్ధి శాఖ వద్ద నాలుగున్నరేళ్లుగా ఉంటున్నాయి. ప్రస్తుతం పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో పంచాయతీలకు తిరిగి డబ్బులు చెల్లిస్తే పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఉపయోగపడుతాయి. సామూహిక మరుగుదొడ్ల పథకం ఇంకా ముగియలేదు. కేంద్రం మంజూరు చేస్తే వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తామని డీఆర్‌డీవో అధికారులు పేర్కొంటున్నారు.

నేర సంస్కృతికి విరుగుడు పుస్తక పఠనమే

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: నేర సంస్కృతికి విరుగుడు, సమాజం సమతౌల్యతను సాధించడానికి పుస్తక పఠనమే శక్తివంతమైందని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) పల్లె నాగేశ్వరరావు సూచించారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో శుక్రవారం ప్రముఖ కవి, రచయిత జూలూరు గౌరీశంకర్ రచించిన ఆత్మకథనాత్మక దీర్ఘ కావ్యం 'జూలూరు పథం' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 94 గ్రంథాలయాలకు ఈ గ్రంథాన్ని బహూకరించే కార్యక్రమం కోదాడలో ప్రారంభించినట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాణోతు బాలమ్మకు ఈ కావ్యం 200 గ్రంథాలను నాగేశ్వరరావు అందించి మాట్లాడారు. సమాజం విద్వేషాల నుంచి బైటపడి శాంతి వైపు పయనించాలంటే పుస్తకమే పదునైనా ఆయుధమన్నారు.



కోదాడలో 'జూలూరు పథం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు, నాయకులు

★ కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ మాట్లాడుతూ.. నడిగూడెం జమీందార్ నాయిని వెంకటరంగారావు 120 గ్రంథాలయాలను స్థాపించి, 60 గ్రంథాలను ముద్రించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. అదే మండలం నుంచి వచ్చిన జూలూరు ఉద్యమ సాహిత్యాన్ని వెలువరించారని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, చిన్ని, పార సీతయ్య, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, పాండురంగారావు, బంగారు నాగమణి, ఎస్ఆర్‌కేమూర్తి, దేవబత్తిని నాగార్జున, నాగిరెడ్డి, నాగేశ్వరరావు, రాంబాబు, శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు, రచయిత, కవులు పాల్గొన్నారు.

బీమా కంపెనీకి వినియోగదారుల కమిషన్ మొట్టికాయ

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: నామినీకి బీమా పాలసీ డబ్బులను చెల్లించడానికి తిరస్కరించిన ఓ బీమా సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయ వేసింది. పాలసీలో నామినీగా ఉన్న మృతుని కుమార్తెకు బీమా మొత్తాన్ని చెల్లించాలని శుక్రవారం ఆదేశాలను జారీ చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బీసీ కాలనీకి చెందిన వక్కంటి తిరుపతయ్య నల్గొండ జిల్లా కేంద్రానికి చెందిన ఓ బీమా సంస్థలో రూ.31,48,399లకు 36 నెలల కాలానికి పాలసీ తీసుకున్నారు. నామినీగా అతని కుమార్తె వక్కంటి రాజాచంద్రను నమోదు చేశాడు. 2021 మే 7న అనారోగ్యంతో తిరుపతయ్య మరణించారు. ఆయన ఇతర వ్యాధులతో ఉండి పాలసీలో చేరాడని.. డబ్బులు చెల్లించలేమని నామినీకి తెలిపారు. దీంతో బాధితురాలు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న కమిషన్ అధ్యక్షుడు మామిడి క్రిస్టోఫర్, సభ్యులు యస్.సంధ్యారాణి, కె.వెంకటేశ్వర్లు శుక్రవారం తుది తీర్పును వెలవరించారు. బాధితురాలికి మొత్తం రూ.31,48,399లను 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించారు. సదరు మొత్తంతో పాటు ఫిర్యాదురాలిని మానసిక వేదనకు గురి చేసినందున నష్టపరిహారంగా రూ.లక్షను చెల్లించాలని, కేసు ఖర్చులు రూ.పదివేలను నేటి నుంచి 45 రోజుల్లో చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

గాలికుంటు నివారణకు టీకాలు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:



గాలికుంటువ్యాధి నివారణకు పశువులకు టీకా వేయడం ప్రారంభించారు. టీకా కార్యక్రమం వచ్చే నెల 14 వరకు సాగుతుంది. నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో మూడు నెలల పైబడిన పశువులకు టీకాలు వేస్తారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాల్లోని పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి క్రిములు గాలితో ప్రయాణించి ఇతర పశువులకు సోకే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న ఎఫ్ఎండీ ప్రోగ్రామ్ కింద ఈ టీకాను ప్రతి ఆరు నెలలకు ఒక సారి వేసి, రాబోయే నాలుగేళ్లలో గాలికుంటు వ్యాధిని పూర్తిగా నివారించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.


★ ఉమ్మడి జిల్లాలో 539406 పశువులు ఉన్నాయి. టీకాలు వేసిన పశువులకు గుర్తుగా కొమ్ములకు ఆకుపచ్చ రంగు వేస్తారు.

ఉదయం వేళ చల్లటి సమయంలోనే టీకాలు వేసే కార్యక్రమం చేపడుతారు. అధికారులు గ్రామాలకు వెళ్లే ముందు రోజు పల్లెల్లో టాం టాం వేయించి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పశువైదులు, సిబ్బంది ప్రతి రైతు వద్దకు వెళ్లాల్సి ఉంది. అందుబాటులో రైతులు లేకపోతే మరో 10 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి:

జూలకంటి వెంకటరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి, నల్గొండ

అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగిస్తాం. గ్రామాల్లో పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



విద్యుత్తు టర్బైన్‌ను పరిశీలించిన జపాన్ నిపుణులు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ ప్రధాన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలోని టర్బైన్‌ను జపాన్‌కు చెందిన నిపుణులు పరిశీలించారు. సాగర్ ప్రధాన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలోని రెండో నంబరు యూనిట్ గతేడాది మరమ్మతులకు గురి కాగా.. జెన్‌కో అధికారులు మరమ్మతులు చేయడానికి పలుమార్లు ప్రయత్నం చేశారు. అది సఫలం కాకపోవడంతో ఆ యూనిట్‌లో విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇటీవల జెన్‌కో సీఎండీ సాగర్ విద్యుత్తు కేంద్రాలను సందర్శించి మరమ్మతులు చేయించడానికి తగిన చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో జెన్‌కో అధికారులు జపాన్‌కు చెందిన టర్బైన్ మరమ్మతుల నిపుణులను పిలిపించారు. శుక్రవారం విద్యుతేంద్రంలో మరమ్మతులకు గురైన యూనిట్‌ను వారు పరిశీలించారు. వెంటనే మరమ్మతులను ప్రారంభిస్తారని జెన్‌కో అధికారులు తెలిపారు.



కూరగాయల మేలెంచి..

పండ్లతోటలను తొలగించి

కూరగాయల ధరలు ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్నాయి. హైదరాబాద్ నగరంలో కొన్ని పేరున్న మాల్స్ వారు నేరుగా రైతుల వద్దకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి నగర వాసులకు విక్రయిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు రైతులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. నగర శివారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జూలూరు గ్రామానికి చెందిన కౌలు రైతు అంజయ్య ఏళ్లుగా పండిస్తున్న సపోటా తోటను తొలగించి నాలుగు ఎకరాల్లో అయిదారు రకాల కూరగాయలు పండిస్తున్నారు. టమాటా, దోస, మిర్చి, కాకర, బీర, బెండలను డ్రిప్ సాయంతో తక్కువ ఖర్చుతో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం టమాటా ధర అధికంగా ఉండటంతో ఎక్కువ సాగు చేస్తున్నారు. పండ్ల తోటతో పోలిస్తే కూరగాయల సాగు లాభదాయకంగా ఉందని రైతు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, బీబీనగర్

నల్గొండ

•నల్గొండ • మునుగోడు • నకిరేకల్

కవితల పోటీలు

నీలగిరి, న్యూస్‌టుడే: తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని డిగ్రీ పీజీ విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహిస్తున్నామని సాహితీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్ తెలిపారు. శుక్రవారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో, నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్ఈకి సన్మానం

నల్గొండ జిల్లా పరిషత్తు: నల్గొండ విద్యుత్తు సంస్థ ఎస్ఈగా వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం ఎస్సీ, ఎస్టీ విద్యుత్తు గుత్తేదారుల సంఘం బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్ఈని పూలమాలలతో సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షులు రుద్రాక్షి రవి, పరమేష్, రవి చంద్ర, సైదులు, నరేందర్ పాల్గొన్నారు.

గట్టుప్పల, న్యూస్‌టుడే

? మండల కేంద్రంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ఒకే వారంలో ఎనిమిది మందిపై దాడి చేశాయి. వెంటనే చర్యలు చేపట్టాలి. పున్న ఆనంద్ గట్టుప్పల..

✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా.

–మాధవరెడ్డి, ఎంపీవో

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలో గొల్లగూడ అండర్ పాఠశాల పక్కన మురుగు కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వ్యాపిస్తోంది. శుభ్రం చేయించాలి. – ఆండాళ్లు, నల్గొండ.

✔ పరిశీలించి కాల్వలు శుభ్రం చేయిస్తాం.

– నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నల్గొండ పురపాలిక.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గట్టుప్పల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో ఎరువుల దుకాణాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారిణి రేవతి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. నకిలీ పురుగు మందులు, నాణ్యత లేని ఎరువులు, విత్తనాలు అమ్మిన డీలర్లపై కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కనగల్: మండలంలోని వివిధ ఎరువుల దుకాణాలను ఏవో బి.అమరేందర్‌గౌడ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నాణ్యత లేని పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుని, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

నాంపల్లి: మండల వ్యవసాయ అధికారిగా బండారు శివ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎరువుల దుకాణాలను సందర్శించి, ఎరువుల నిల్వలు పరిశీలించారు. నాణ్యతలేని విత్తనాలు, ఎరువుల విక్రయాలు జరిపినా, కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వకపోయినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని దుకాణదారులను హెచ్చరించారు.

క్షేత్ర పర్యటనలో ఎన్జీ కళాశాల విద్యార్థులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: క్షేత్ర పర్యటనలో భాగంగా నల్గొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వివిధ కోర్సుల విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్)ను సందర్శించారు. అక్కడి శాస్త్రవేత్తలతో మాట్లాడి ఉన్నత విద్యా పరిశోధనలకు అవసరమయ్యే అంశాలపై అవగాహన పొందారు. ప్రధానమైన అంశాలను విద్యార్థులు నోట్ చేసుకుని తెలియని అంశాలను నివృత్తి చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, రవికుమార్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వరి, కృష్ణ, పాల్గొన్నారు.

సాయమే.. ఆమె సంకల్పం



కందాల క్షీణత వ్యాధితో బాధపడుతున్న జంపాల గోపాల్‌కు నిత్యావసర సరకులు అందజేస్తున్న అమ్మ ఫౌండేషన్ బృందం

నీలగిరి, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారికి సాయం చేసేందుకు ఆస్తులు, అంతస్తులు ఉండాలని ఏమీలేదు. సాయం చేయాలనే మనసు ఉంటే చాలు. వారసత్వంగా వచ్చిన ఆస్తులేమీ లేవు కానీ. సాయం చేయాలన్న సంకల్పంతో ఓ యువతి తన మిత్రులతో కలిసి అమ్మ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. వారు చేస్తున్న చిన్న చిన్న సాయాలతోనే ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్నతనం లోనే అమ్మ నాన్నలను దూరమైన బాధ ఎలా ఉంటుందో తెలుసుకుని అనాథలకు సాయం చేయాలనే లక్ష్యంతో ముందడుగు వేశారు రేఖ. వ్యక్తులుగా కాదు ఒక సంస్థగా ఏర్పడి సాయం చేస్తే బాగుంటుందని 2018లో అమ్మ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారికి సాయం అందిస్తున్నారు.

రక్తదానం నుంచి ఆకలి తీర్చేవరకు...

అత్యవసర సమయంలో రక్తదానం నుంచి ఆకలితో ఉన్నవారికి అన్నం సేకరించి అందజేయడం వరకు అన్ని రకాల సేవా కార్యక్రమాలను అమ్మ ఫౌండేషన్ సభ్యులు అందజేస్తున్నారు. రోడ్డుపై ఒంటరిగా ఉన్న వృద్ధులు, పిల్లలను చేరదీసి పునరావాసానికి పంపుతున్నారు. శుభకార్యాల్లో మిగిలిన అన్నం, కూరలను సేకరించి అనాథలకు అందజేస్తున్నారు.

ఆపదలో ఉన్నవారికి..



స్నేహారెడ్డి, సభ్యురాలు

ఆపదలో ఉన్నవారికి సాయం చేద్దామని రేఖ అమ్మ మిత్రులు చేస్తున్న సేవ గురించి తెలుసుకుని వారితో కలిశాను. శుభకార్యాలలో మిగిలిన భోజనం పేదలకు పంచుతున్న సమయంలో వారు చూపించే ఆప్యాయత ఎంతో ఉత్సాహం కలిగించింది. వేలాదిమందికి రక్తదానం చేయడానికి సాయం చేశాం. పిల్లలు, వృద్ధులకు అండగా నిలిచాం.

అమ్మానాన్నను కోల్పోయి: రేఖ, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు



నాకు ఊహ తెలిసే సమయానికి అమ్మ నాన్న మృతి చెందారు. మేం ఐదుగురం అక్కాచెల్లెళ్లం. దీంతో మేమంతా అనాథలం అయ్యాం. బంధువులు, తెలిసిన వారు మమ్మల్ని పెంచి పోషించారు. అలా తీసుకెళ్లిన కొందరు చేరదీసి పెంచి పెద్ద చేశారు. మా సోదరీమణులను ఇప్పటి వరకు కలుసుకోలేకపోయాను. నా అనుకునే వారు లేని బాధను చూసిన నేను అనాథలకు సాయం చేయాలనే ఆలోచనతో 2018లో అమ్మ ఫౌండేషన్ ఏర్పాటు చేశా. మిత్రుల సాయంతో సేవా కార్యక్రమాలను చేస్తున్నా. ప్రైవేటులో ఉద్యోగం చేస్తూ తనకు వచ్చిన దానిలో నుంచి కొంత మొత్తంలో ఖర్చు చేస్తూ చేతనైన సాయం చేస్తున్నా.

సామూహిక జన్మదిన వేడుకలు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కుటుంబ పింఛనుదారులకు సామూహిక జన్మదిన వేడుకలను స్థానిక సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి బి.లింగయ్య, నకిరేకల్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు వి.రామలింగం, కె.సోమయ్య, భిక్షంరెడ్డి, ప్రతినిధులు కె.సాహిరెడ్డి, వి.రవీందర్, సత్యనారాయణ, మల్లయ్య, పి.వెంకటనారాయణ పాల్గొన్నారు.



నకిరేకల్: విశ్రాంత ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు

'సహ' చట్టం సగటు మనిషి ఆయుధం

చిట్యాల: సహచట్టం సగటు మనిషికి ఆయుధం లాంటిదని సీపీఎం జిల్లాకమిటీ సభ్యుడు జిట్ట నగేష్ పేర్కొన్నారు. సహ చట్టం (2005) అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిట్యాలలో సహ ప్రజాప్రాతినిధ్య సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమితి పతాకాన్ని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బ బాబూరావు ఆవిష్కరించారు. అవిశెట్టి శంకరయ్య, ఎల్లేశ్, ఏనుగు నరేందర్‌రెడ్డి, అధ్యాలు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ

మర్రిగూడ, న్యూస్‌టుడే: విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే దోహద పడుతుందని హెచ్ఎం కళ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు కరాటే శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆత్మ రక్షణ శిక్షకులు బుషిపాక సంధ్య హాజరై అత్యవసర సమయంలో తమను తాము ఎలా రక్షించుకోవాలో వివరించారు. బాలరాజు, రేణుక ఉన్నారు.



మర్రిగూడ ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణలో విద్యార్థినులు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

నల్గొండలోని ఏకలవ్య ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ బహుమతి డి.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఏకలవ్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.వాణి

వేదశ్రీ(8వ తరగతి), ద్వితీయ బహుమతి ఎం.అభివర్షరెడ్డి(8వ తరగతి), తృతీయ బహుమతి పి.శ్రీసాత్విక(8వ తరగతి)లు గెలుచుకున్నారు. ఏకలవ్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.వాణి విజేతలకు బహుమతులు అందచేసి అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ మారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. –నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం



నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందగా మరో ఇద్దరు వృద్ధులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... చిట్యాల మండలంలోని నేరడ చెందిన మిర్యాల కౌసల్య(60), మోసం రామస్వామి, అన్నపూర్ణ దంపతులతో కలిసి కట్టంగూరు మండలంలోని ఈదులూరులో సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. జాతీయ రహదారి-65పై గోపలాయపల్లిలో రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వారి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కామినేని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కౌసల్య మృతి చెందారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


నాంపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం మండలపరిధిలోని పస్నూరులో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాపోలు జంగయ్య, లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు అనారోగ్యంతో గతంలోనే మృతి చెందాడు. చిన్న కుమారుడు సందీప్(20) ఈ నెల 12న చింతపల్లి మండలం నెల్వలపల్లిలోని స్నేహితులను కలిసి తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

రైతుక్లబ్ మాజీ అధ్యక్షుడు..

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాలకు చెందిన నవయువ రైతుక్లబ్ మాజీ అధ్యక్షుడు కుక్కల చంద్రయ్య(70) శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పీఆర్‌పీఎస్ అధ్యక్షుడు నన్నె వెంకటస్వామి, భువనగిరి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వరికుప్పల గోపాల్, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు సందర్శించి నివాళి అర్పించారు.

మాజీ వార్డు సభ్యుడు..

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ మాజీ వార్డు సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మురుమడ్ల శంకరయ్య(65) శుక్రవారం మృతిచెందారు. స్థానిక శివాలయంలో నిర్మాణంలో ఉన్న తన ఇంటికి నీళ్లుకొట్టేందుకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఆయన మృతికి పుర వైస్‌ఛైర్మన్ చౌగోని రజిత, కాంగ్రెస్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, పద్మ, శ్రీనివాస్ సంతాపం తెలిపారు.



శంకరయ్య

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అభినందనలు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈనెల 22నుంచి నిర్వహించే ఎన్ఎస్ఎస్ జాతీయ సహస శిబిరానికి మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయానికి చెందిన 8 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపికయ్యారు. శిబిరంలో పాల్గొనేందుకు వెళ్తున్న వీరిని శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.మద్దిలేటి అభినందించారు. విద్యార్థులు సహస శిబిరంలో ప్రతిభ చాటి వర్సిటీకి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రమంతి, హరికిషన్, పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అభినందిస్తున్న ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, తదితరులు

పీఆర్టీయూ అభ్యర్థిని గెలిపించాలి

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సైదిరెడ్డిపాష పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి.. చిట్యాల గ్రామీణం: అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ మండలాధ్యక్షుడు కంచర కుంట్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వట్టిమర్తి, వనిపాకల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సంఘ సభ్యులతో కలిసి ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనయ్యచారి, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సయ్యదిరెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

అవీ ఇవీ

బాధ్యతల స్వీకరణ.. శాలిగౌరారం: శాలిగౌరారం మండలంలోని విద్యు, వైద్య, రెవెన్యూ శాఖల్లో నూతనంగా అధికారులు బాధ్యతలు స్వీకరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిగా రాజేష్‌కుమార్, ఎంఈవోగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్‌గా వరప్రసాద్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా కృష్ణమోహన్‌లు బాధ్యతలు తీసుకున్నారు.

నియామకం.. మునుగోడు: మండల పరిధిలోని కల్వలపల్లి గ్రామానికి చెందిన సాగర్ మల్లేష్ సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నిక య్యారు. మిర్యాల భరత్, వరికుప్పల ముత్యాలు, వేముల లింగస్వామి, శ్రీను, మధు, యాదయ్య, హనుమయ్య, కంతయ్య తదితరులు మండల కమిటీ సభ్యులుగా ఎన్నికైనారు.



చిట్యాల గ్రామీణం: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన మంద వేణుగోపాల్‌రెడ్డి ఆర్టీఏ రక్షక్ జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆమంగంటి సతీశ్, జిల్లా అధ్యక్షుడు కూనూరు మధు శుక్రవారం నియామక పత్రం అందజేశారు.

చెక్కుల పంపిణీ.. మర్రిగూడ: మండల పరిధిలోని కొట్టాల గ్రామానికి చెందిన మేతరి నిర్మల, లింగయ్య, కల్లెట్ల వెంకటేశ్వర్లకు మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం నాయకులు మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, సరిత వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం.. మునుగోడు: మునుగోడు మండలంలోని పలు గ్రామాలకు అనుసంధాన రోడ్లు ఏర్పాటుకు రూ.10 కోట్లు నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు మేకల ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఢిల్లీలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. పీఏసీఎస్ ఛైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, రాము యాదవ్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం.. నకిరేకల్: మంగళపల్లి గ్రామంలో గుండెకు సంబంధించిన సమస్యతో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన వ్యవసాయ కూలీ సీహెచ్.నాగయ్యకు బీజేఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు శుక్రవారం రూ.10వేలను సాయంగా అందజేశారు.

20న సీపీఎం పట్టణ మహాసభ.. నల్గొండ టౌన్: సీపీఎం పట్టణ మహాసభ ఈ నెల 20న నల్గొండలోని జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నామని పార్టీ పట్టణ కార్యదర్శి సలీం అన్నారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సత్తయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలతో న్యాయం జరగదు.. నార్కట్‌పల్లి గ్రామీణం: ఇందిరమ్మ కమిటీలతో పేద ప్రజలకు న్యాయం జరగదని నల్గొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రేగట్టె మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఇళ్ల ఎంపిక ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలంటే ప్రత్యేక అధికారిని నియమించి గ్రామ స్థాయిలో త్రిసభ్య అధికార కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



యల్లారెడ్డిగూడెంలో పీఏసీఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: రైతులు ధాన్యం విక్రయంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. శుక్రవారం మండలంలోని ఏపీ.లింగోటం, నార్కట్‌పల్లి, యల్లారెడ్డిగూడెంలోని పీఏసీఎస్ కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు తేమ ధాన్యం తెచ్చేలా చూడాలని, తూకంలో మోసాలకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నాయకులు సట్టు సత్తయ్య, భరత్, కృష్ణ, మాజీ సర్పంచి కొండయ్య, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ నారాయణరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

చిట్యాల గ్రామీణం: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, డీసీసీబీ వైస్ ఛైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

కనగల్: ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ పద్మ, ఏవో బి.అమరేందర్‌గౌడ్, ఏపీఎం సంకు హరి ప్రారంభించారు. చర్లగౌరారం, జీయపల్లి, బచ్చన్నగూడెం, శేరిలింగోటం, చెట్లచెన్నారం, తిమ్మన్నగూడెం, తెలకంటిగూడెం, రామచంద్రాపురం, పొంగోడు, తుర్కపల్లి, ఎంగోరారం, మడవాండ్ల గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పులకరం సుజాత, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, రాజిరెడ్డి, లింగయ్య, రాంబాబు, శివయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సినిమాలు	నల్గొండ కల్చరల్, నకిరేకల్
నల్గొండ:	నటరాజ్: దేవర, తిరుమల: వేట్టయన్, వెంకటేశ్వర: విశ్వం,
	పీవీఆర్: మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్:	రామకృష్ణ- విశ్వం, వెంకటేశ్వర- దేవర

గురుకుల పాఠశాలలోకి జాతీయ పక్షి

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ ఎస్ఎల్‌బీసీ కాలనీలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలోకి జాతీయ పక్షి నెమలి శుక్రవారం ప్రవేశించింది. దీనిని అటవీ శాఖ నకిరేకల్ సెంకక్షన్ సహాయకుడు(టీఏ) గిరిబాబుకు అప్పగించారు. పాఠశాల ప్రిన్సిపల్ జె.శోభారాణి, అధ్యాపకుడు యాదయ్య తెలిపారు. నెమలి రెక్కలకు గాయాలు ఉండటంతో స్థానిక పశువైద్యశాలలో చికిత్స చేయించామని గిరిబాబు చెప్పారు. ప్రస్తుతం నెమలిని శివారులోని అటవీశాఖ నర్సరీకి తరలించామన్నారు. శనివారం కుదరని ప్రాంతంలో వదిలి పెడతామని తెలిపారు. అనంతరం దామరచర్ల మండలంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని తెలిపారు.



నకిరేకల్: అటవీశాఖ టీఏ గిరిబాబుకు నెమలిని అప్పగిస్తున్న ప్రిన్సిపల్ శోభారాణి, అధ్యాపకుడు యాదయ్య

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఊట్కూరులో వీధులను పరిశీలిస్తున్న ఎంపీడీవో జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి.. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని శాలిగౌరారం ఎంపీడీవో జ్యోతిలక్ష్మి అన్నారు. ఊట్కూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను, పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణను పరిశీలించారు. ఏపీఎం జంగయ్య, ఈసీ వెంకటాచారి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మారనున్న మునుగోడు రూపురేఖలు

మునుగోడు, న్యూస్‌టుడే: మునుగోడు పట్టణంలో నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. మొదటగా చౌటుప్పల్ రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నాలుగు వరుసల రహదారి ఏర్పాటు కాబోతుంది. ప్రజల సౌకర్యార్థం ప్రణాళికను తయారు చేయడమే కాకుండా అవసరమైన నిధులను మంజూరు చేయించారు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న పట్టణ ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతుంది.

ప్రారంభమైన పనులు..



దుకాణ దారులకు నోటీసులను అందజేస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు

నియోజకవర్గ కేంద్రంలోని నల్గొండ రోడ్డులో వంతెన నుంచి చౌటుప్పల్ రహదారిలోని ప్రభుత్వ కార్యాలయాల దాటిన తర్వాత (మొత్తంగా 2.4 కి.మీ.) వరకు రూ.14 కోట్ల నిధులతో నాలుగు వరుసల రహదారి ఏర్పాటుకు పనులు ప్రారంభం అయ్యాయి. మునుగోడు చౌరస్తా నుంచి చండూరుకు వెళ్లే రహదారిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దాటిన తర్వాత 100 మీటర్లు (1.5 కి.మీ.) వరకు నైతం రూ.10 కోట్ల నిధులతో నాలుగు వరుసల రహదారి ఏర్పాటుతో పాటు మధ్యలో సెంట్రల్ డివైడర్, పుట్‌పాత్ పనులు చేపట్టనున్నారు.



మునుగోడులోని చౌటుప్పల్ రహదారిలో ప్రారంభమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

గుపై వంతెన నైతం ఏర్పాటు కానుంది. రహదారితో పాటు మధ్యలో నాలుగు అడుగుల వెడల్పులో డివైడర్‌లో రకరకాల చెట్లు, బటర్‌ఫ్లై లైటింగ్, రోడ్డుకు ఇరువైపులా అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై పుట్‌పాత్ ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 66 అడుగుల వెడల్పులో ఈ పనులు చేపట్టనున్నారు.

ఆరు నెలల్లో పూర్తి చేసే విధంగా చర్యలు:

శిరీష్, ఆర్అండ్‌బీ ఏఈఈ, మునుగోడు

నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులను ఆరు నెలల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మార్కింగ్ నైతం పూర్తయింది. 66 అడుగుల వెడల్పులో నాలుగు వరుసల రహదారితో పాటు మీడియన్‌లో చెట్లు, లైటింగ్, ఇరువైపులా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పుట్‌పాత్ ఏర్పాటు కానుంది.

అమరుల ఆశయాలు చిరస్మరణీయం

కేతేపల్లి: అమరుల ఆశయాలు చిరస్మరణీయంగా ఉంటాయని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని బండపాలెం గ్రామంలో సీపీఎం నాయకురాలు ఆదిమళ్ల జానమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని కమ్యూనిస్టుపార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందాల ప్రమీల, కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, లూర్దుమారయ్య, ఎల్.రాజు, సి.హెచ్.నాగయ్య, ఎ.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆశా రిజిస్టర్లను ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో

చిట్యాల, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తల రిజిస్టర్లను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్ చిట్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోగుల నుంచి సేకరించిన రక్తనమూనాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసే రిజిస్టర్లను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, డీవో డాక్టర్ పద్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఈసం వెంకటేశం పాల్గొన్నారు.



చిట్యాలలో ఆశా రిజిస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

వ్యవసాయ మోటార్ల దొంగలకు రిమాండ్

కనగల్, న్యూస్‌టుడే: మండలంలో వివిధ గ్రామాల్లో వ్యవసాయ బావులు, కాలువల వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లు, రాగివైరు దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పి.విష్ణు తెలిపారు. కనగల్ గ్రామానికి చెందిన పగిడిమర్రి రాంబాబు, కసిరి నగేష్, మహమ్మద్ రఫీ, నక్క శివ, ఎండీ సత్తార్ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతూ వ్యవసాయ మోటార్లను చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలో అపహరించిన మోటార్లను మహ్మద్ రఫీ ఆటోలో నల్గొండలో విక్రయించడానికి వెళ్తుండగా, కనగల్ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. రాంబాబు, నగేష్, రఫీలను అరెస్టు చేయగా శివ, సత్తార్‌లు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి తీవ్ర గాయాలు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లో ప్రధాన రహదారిపై ఐవోసీ బంక్ వద్ద గురువారం రాత్రి ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో స్థానిక శివాలయం కాలనీకి చెందిన వి.చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు నల్గొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు. బాధితుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్సై లచ్చిరెడ్డి వివరించారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుర్మపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని అన్నారు. అనంతరం సీపీఎం గ్రామశాఖ కార్యదర్శిగా పోలేజీ బ్రహ్మచారి, కార్యదర్శులుగా చలిచీమల కోటేష్, సాయి, కార్యదర్శిగా దండేటికార్ ఈశ్వర్‌లతోపాటు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి రాములు, వెంకటయ్య, అమృతాచారి, శ్రీకాంత్, మురళి, వెంకటయ్య, రాజు, విఠల్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద చిన్న వర్షం పడితేనే పక్క కాల్వలోని మురుగు రోడ్డుపై ప్రవహిస్తూ అనేక అవస్థలు పడుతున్నాం. – అజయ్, మిర్యాలగూడ

✔ మురుగు బయటకు రాకుండా చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలోని కొత్త బస్టాండ్‌కు వెళ్లే రహదారిలో ప్రైవేట్ వాహనాలతో ఇబ్బందికరంగా మారింది. అక్కడ ఇతర వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నాయి. – కె.వెంకటాచారి, దేవరకొండ

✔ పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది సంయుక్తంగా రోడ్డు సాఫీగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. – రమేష్, ఆర్టీసీ డీఎం

ప్రతిభ చూపి.. బహుమతి పట్టి



ఈనాడు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని శాస్త్ర హైస్కూల్‌లో 'అంతర్జాల వినియోగం-విద్యార్థులలో సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పరీక్ష రాయగా ప్రథమ బహుమతి సపావట్ జనని (10వ తరగతి), ద్వితీయ బహుమతి బాణాల శ్రీనాథ్ (8వ తరగతి), తృతీయ బహుమతి వడ్డెగుంట హర్షిత (9వ తరగతి) గెలుచుకున్నారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



❖ వాసవీ కాలనీ ఎస్వీమోడల్ స్కూల్‌లో మధ్యాహ్నం 'అంతర్జాల వినియోగం-విద్యార్థులలో సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పరీక్ష రాయగా ప్రథమ బహుమతి ఓరుగంటి విధుచంద్రకుమార్ (10వ తరగతి), ద్వితీయ బహుమతి కల్లోజు మురారి (9వ తరగతి), తృతీయ బహుమతి రమావత్ నిహారిక (8వ తరగతి) గెలుచుకున్నారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శ్యామ్‌సుందర్ బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు. –మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

ముగిసిన శిక్షణ తరగతులు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజులుగా సాగిన మిషన్ భగీరథ మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. శిక్షణలో పైప్‌లైన్ లీకేజీలు, చేతి పంపుల మరమ్మతులు, సింగిల్ ఫేజ్ మోటార్లు, తాగు నీటి నాణ్యత తదితర అంశాలపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న సిబ్బందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మిషన్ భగీరథ ఈఈ డి.శాంతకుమారి, కె.నగేష్, ఎంపీడీవో బాలరాజు రెడ్డి, ఏఈలు మాల్యాద్రి, శేఖర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న అధికారులు

విద్యార్థుల సృజనాత్మకత భళా



'ఈనాడు' ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు తాహియ ముబాషిర (10వ తరగతి), ఇ.లాస్య (9వ తరగతి), ఎం.డి. షాతియాకౌసర్ (9వ తరగతి) గెలుచుకున్నారు. వీరికి పాఠశాల డైరెక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ నవీన్‌గౌడ్, వైస్‌ప్రిన్సిపల్ ఎం.డి.అన్వర్‌హుస్సేన్, ఉపాధ్యాయులు వెంకట్రాములు, మహేష్, మహేందర్, కరీం, ఉమేష్, పీఈటీ తదితరులున్నారు.



❖ ఎస్పీఆర్ పాఠశాలలో 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు ఆర్.జేయేందర్ (8వ తరగతి), వి.శరణ్య (10వ తరగతి), ఎల్.అభినందన్‌రెడ్డి (9వ తరగతి) గెల్చుకున్నారు. వీరికి పాఠశాల ప్రిన్సిపాల్ టి.మహేష్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డైరెక్టర్లు వాస శ్రావణ్‌కుమార్, సీహెచ్.లింగం, వైస్‌ప్రిన్సిపల్ ఏ.అరుణ, ఉపాధ్యాయులు చంద్రయ్య, జోసెఫ్, అర్చ్య, తదితరులున్నారు. – దేవరకొండ, న్యూస్‌టుడే:

మూఢనమ్మకాలను నమ్మొద్దు

వేములపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శెట్టిపాలెంలో వరుస మరణాల కారణంగా గ్రామస్థులు గురువారం గ్రామాన్ని ఖాళీ చేసి వనభోజనాలకు వెళ్లారు. విషయం తెలుసుకున్న డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణరెడ్డి, హెల్త్ టీం శుక్రవారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులకు, విద్యార్థులకు ఆరోగ్య విషయాల గురించి అవగాహన కల్పించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో జరిగిన మరణాలన్నీ యాదృచ్ఛికంగా జరిగినవేనని.. వీటికి మూఢనమ్మకాలను ఆపాదించరాదన్నారు. వేములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పబ్లిక్ హెల్త్ నర్స్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ శాంతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ అరుణ, ఏఎన్ఎం జయమ్మ, ఆశాలు రూన్సీ, నాగమ్మ, శైలజ, పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.12 లక్షలు

చందంపేట, న్యూస్‌టుడే: కులాలకు అతీతంగా ఈ నెల 11న పెద్దమునిగల్‌లో నిర్వహించిన అంబావరాని ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి నగదు, ఆభరణాలు సమర్పించుకున్నారు. శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంబావాని హుండీ ఆదాయాన్ని లెక్కించగా నగదు రూ.12 లక్షల నగదు, కిలోన్నర వెండి, రెండు తులాల బంగారు ఆభరణాలు సమర్పించుకున్నారని ఆలయ పూజారి కేతావత్ జీవన్ ప్రసాద్ భగత్ తెలిపారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.3 లక్షలు అదనంగా వచ్చాయని తెలిపారు.

నిబంధనల ప్రకారం ఓటు నమోదు చేసుకోండి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అర్హులైన ఉపాధ్యాయులందరూ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా



మిర్యాలగూడ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్

అధ్యక్షుడు డీపీఎస్ ఫణికుమార్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో ఓటు నమోదు చేయించి మాట్లాడారు. రాంరెడ్డి, సైదిరెడ్డి, దర్యానాయక్, గోపీనాయక్, యాదగిరిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ద్వర్తిగా, రమణాచారి, నాగలత, వినోద, పద్మశ్రీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలి

దామరచర్ల, న్యూస్‌టుడే: గ్రామాలలో ప్రజాప్రతినిధులు లేనందున పంచాయతీకార్యదర్శులు బాధ్యతతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం దామరచర్లలో అధికారులతో సమీక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అధికారులకు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. తాను ఆకస్మిక తనిఖీ చేపడతానని విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, తహసీల్దార్ జవహర్‌లాల్, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, సైదిలాల్‌నాయక్, గాజులశ్రీనివాస్, రవితేజ, కిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహాయక కేంద్రం



అవంతీపురం మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, కలెక్టర్ నారాయణరెడ్డి

మిర్యాలగూడ పట్టణం: వరి ధాన్యానికి మద్దతు రావాలంటే తేమ 17శాతం లోపు, మట్టి, రాళ్లు 1 శాతం లోపు, తాలు మూడు శాతం, రంగు మారు 5శాతం లోపు ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం విక్రయాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని.. రైతులు 99634 07064 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించవచ్చన్నారు. జిల్లాలో మొత్తం 24 జిన్నింగ్ మిల్లులు ఉండగా.. 19 మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు.

☛ మిర్యాలగూడ పరిధిలో ధాన్యం కొనుగోళ్ల సక్రమంగా సాగేందుకు మిల్లులు ఉన్న మార్గాల్లో ఒక్కో మార్గానికి ఐదుగురు వ్యవసాయ అధికారులను నియమించినట్లు ఎమ్మెల్యే బీఎల్ఆర్ తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల్లో ఎక్కడ ఎక్కువ ధర వస్తే అక్కడ అమ్ముకోవచ్చన్నారు. డివిజన్ పరిధిలో మొత్తం 74 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీసీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీవో శేషగిరిశర్మ, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే మొదటిగా ధాన్యం కొనుగోళ్లు

మిర్యాలగూడ: రాష్ట్రంలోనే మొదటిగా మిర్యాలగూడ ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని డివిజన్‌లో 74 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సన్నరకం ధాన్యం కొనుగోలు కోసం ప్రత్యేకంగా 51 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఐకేపీ 40, పీఏసీఎస్ 34 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా సరిహద్దుల్లో వాడపల్లి, అడవిదేవులపల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట డివిజనల్ పౌరసరఫరాల అధికారి శ్రీనివాసశర్మ సిబ్బంది ఉన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దు..

వేములపల్లి: మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామ శివారులోని మహాశక్తి, లక్ష్మీ రైస్ మిల్లులలో శుక్రవారం డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి మాట్లాడారు. ఆయకట్టు పరిధి కాని రైతులు పంట నూర్పిడి చేపట్టిన తమ ధాన్యాన్ని విక్రయించేందుకు మిల్లుల వద్దకు రాగా మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వర్షాభావ పరిస్థితులకు అడ్డుగా పెట్టుకుని ఇష్టానుసారంగా కొనుగోలు చేసినట్లయితే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, ఎంపీడీవో శారదాదేవి, మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, మిల్లర్లు బండారు కుశలయ్య పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మూగజీవాలు మృత్యువాత

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కురిసిన వర్షానికి పిడుగుపాటుకు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఆభంగాపురం గ్రామంలో బోయ మల్లయ్యకు చెందిన నాలుగు మేకలు, కోయలపహాడ్‌కు చెందిన పందిరి లింగయ్య పాడిగేదె మృతిచెందాయి. మేకలు సుమారు రూ.ముప్పైవేలు, పాడిగేదెకు రూ.అరవైవేలు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

గృహోపకరణాలు దగ్ధం..

మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడలోని శాంతినగర్‌కు చెందిన బొల్లా లక్ష్మీనారాయణ ఇంటిపై శుక్రవారం పిడుగు పడి.. ఇంటి పైకప్పు గోడ, రేకులు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు స్థానిక కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పిడుగుధాటికి సమీపంలోని 20 ఇళ్లలో టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఏసీలు, వాషింగ్‌మెషిన్లు వంటి గృహోపకరణాలు దగ్ధమైనట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నిడమనూరు, న్యూస్‌టుడే: వాహనం ఢీకొని ద్విచక్రవాహనం నడుపుతున్న ఓ వ్యక్తికి కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలైన ఘటన నిడమనూరు మండల కేంద్రానికి సమీపాన ఉన్న పార్వతిపురం స్టేజీ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతిపురం గ్రామానికి చెందిన చిలుముల భూమయ్య(60) తన ద్విచక్రవాహనంపై నిడమనూరు వచ్చి తిరిగి పార్వతిపురం వెళ్తున్నాడు. పార్వతిపురం స్టేజీ వద్దకు రాగానే ద్విచక్రవాహనం గ్రామం వైపు వెళ్తుండగా మిర్యాలగూడ వైపు తన వాహనంలో డిండికి చెందిన శివ భూమయ్యను ఢీకొట్టారు. ఈ ప్రమదంలో భూమయ్యకు కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

ట్యాంకు ఎక్కి నిరసన



కాల్వపల్లి గుట్టమీద ఉన్న ఉపరితల ట్యాంకు ఎక్కిన జీవీపీఆర్ ఏజెన్సీ కార్మికులు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా సదరు ఏజెన్సీ అధికారులు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ.. మండల పరిధిలోని అవంతీపురం, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో పని చేస్తున్న ఉద్యోగులు కాల్వపల్లి గుట్టపై ఉన్న ఉపరితల ట్యాంకుపైకి గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధ్యాహ్నం ఆహారం మాని నిరసన తెలిపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డీఈఈ అన్వర్, మరి కొందరు అధికారులు అక్కడికెళ్లి ఏజెన్సీ అధికారులతో మాట్లాడి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని మాట ఇవ్వడంతో దిగినట్లు కార్మికులు తెలిపారు.

ఉన్నతాధికారులు వేధిస్తున్నారని..

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పైస్థాయి సిబ్బంది చేయాల్సిన పనులను తనను చేయాలని ఉన్నతాధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ మిర్యాలగూడలోని ఎన్నెస్పీ డివిజన్-3లో జూనియర్ సహాయకురాలు పావని శుక్రవారం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి మూడున్నరేళ్లుగా తనను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఘటనపై వివరణ కోరేందుకు ఈఈ లక్ష్మణ్ కోసం ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

త్రిపురారం, న్యూస్‌టుడే: త్రిపురారం సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్టర్ మురళి అన్నారు. శుక్రవారం మండలంలోని బడాయిగడ్డ, రాగడప గ్రామాల్లో ధాన్యం కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని కోరారు. సహకార సంఘం ఛైర్మన్ జయరాంనాయక్, మండల వ్యవసాయాధికారి పార్వతి చౌహాన్, సీఈవో నరసయ్య, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: మండలంలోని ఉల్సాయిపాలెం, మొల్కచర్ల గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీరాం సురేష్‌కుమార్ ప్రారంభించారు. ఏవో గుర్రం సరిత, ఆర్ఐ శ్యాంసుందర్, ఏపీఎం శేషయ్య, సీసీ విజయకుమారి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే.. అదనపు కలెక్టర్ పరిశీలన

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణంలో ఉన్న సమయంలో గట్టుమీదితండా, సుంకిశాలతండాలకు ముంపు గ్రామాలుగా డిఫామ్స్ ఇచ్చారని, కస్తూ కబ్జాలో ఉన్న రైతుల ప్రకారంగా ఎంజాయ్‌మెంట్ సర్వే చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని గట్టుమీదితండా, సుంకిశాలతండాలలో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద గ్రామ శివారులోని పెండింగ్‌లో ఉన్న సర్వే నంబర్లు అన్నీ రెవెన్యూ బృందాలు త్వరలోనే పూర్తి చేశారని తెలిపారు. ఫారెస్ట్ భూములు వాటి హద్దు ప్రకారంగా జాయింట్ అటవీ, రెవెన్యూ సర్వే చేయాలన్నారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, ల్యాండ్ రికార్డ్ ఏడి శ్రీనివాస్, డీఐ రమణయ్య, మునినాయక్, బద్రి రెవెన్యూ బృందాలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



అడవిదేవులపల్లిలోని ఓ ఎరువుల దుకాణంలో పురుగుమందులను పరిశీలిస్తున్న ఏవో సరిత

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: ఎరువులు, పురుగు మందుల అమ్మకాల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారిణి గుర్రం సరిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుగు మందుల నిల్వలు, బిల్లు పుస్తకాలు, దస్త్రాలను తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

చింతపల్లి: ఎరువుల దుకాణాల్లో నాణ్యత లేని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి శ్రవణ కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు దుకాణాల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కాపలాదారు దుర్మరణం

యాచారం, న్యూస్‌టుడే: యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. నల్గొండ జిల్లా దిండి మండలం కానాపూర్ గ్రామ నివాసి తుపాకుల మల్లేశ (40) యాచారం మండలం నందివనపర్తి రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో కాపలాదారు (సెక్యూరిటీ గార్డు)గా పని చేస్తుంటాడు. ఇతడు మోటారు సైకిల్‌పై నానక్‌నగర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా.. పిల్లిపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. యాచారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టరు బోల్తా పడి డ్రైవరు మృతి

నాగోలు, న్యూస్‌టుడే: ట్రాక్టరు బోల్తా పడి డ్రైవరు మృతిచెందిన సంఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీతారామపురానికి షేక్ మౌలానా(57) డ్రైవరుగా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం హస్తినాపురంలోని మ్యాక్స్ షోరూం భవనం సెల్లార్ నుంచి తన ట్రాక్టరులోకి మట్టిని లోడ్ చేసుకున్నాడు. భారీ లోడుతో ఉన్న ట్రాక్టరు సెల్లార్ నుంచి బయటికి వచ్చే క్రమంలో ఇంజిన్ ఒక్కసారిగా పైకిలేచి డ్రైవింగ్ చేస్తున్న మౌలానాపై పడింది. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం రాత్రి భార్య షేక్ బిపాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మిర్యాలగూడలో చోటు చేసుకుంది. పాఠశాల వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఈ ఏడాది ఆగస్టులో పాఠశాలలో చేరింది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన బాలిక.. శుక్రవారం ఉదయం తిరిగి పాఠశాలకు చేరుకుంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో కళ్లు తిరుగుతున్నాయని.. ఇంటి వద్ద గడ్డి మందు తాగి వచ్చానని తోటి విద్యార్థినులకు చెప్పడంతో తక్షణమే పాఠశాల సిబ్బంది ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనతో నల్గొండ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని పాఠశాల సిబ్బంది తెలిపారు. కాగా ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగితే సాయంత్రం వరకు ఎటువంటి అనారోగ్య లక్షణాలు బయటపడకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నిక.. పెద్దఅడిశర్లపల్లి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూస్) పీఏపల్లి మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పీఏపల్లిలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పీఏపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు జింకల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పీఏపల్లి ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు పిల్లి ఏడుకొండల్‌లను ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్ తెలిపారు. సంఘం బాధ్యులు కె.సంతోష్‌రెడ్డి, కె.సైదులు, బి.అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపిక.. గుర్రంపోడు: రాష్ట్ర క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం దేవరకొండలో జరుగుతున్న వాలీబాల్ జట్ల ఎంపిక పోటీల్లో గుర్రంపోడు మండలం పిట్టలగూడెం మైనారిటీ గురుకుల కళాశాలకు చెందిన మనోహర్, శివలు దేవరకొండ డివిజన్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్ మహ్మద్ ఫారూఖ్, పీఈటీ శ్రీను, వార్డెన్ సయ్యద్‌మియా అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి.. దామరచర్ల: ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే బత్తులలక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఎం.వినోద్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వభూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. దయానంద్, పాపానాయక్ తదితరులున్నారు.

క్రమబద్ధీకరించుకోండి.. మిర్యాలగూడ గ్రామీణం: ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న భూ యజమానులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు సమర్పించి క్రమబద్ధీకరించుకోవాలని మండల అభివృద్ధి అధికారి శేషగిరి శర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్రాసెస్ చేసేందుకు ఆదివారం అధికారులు అందుబాటులో ఉంటారని ప్రజలు దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేసునమోదు.. గుర్రంపోడు: ఎదురింటి వారు తనను తిడుతూ గొడవకు దిగి కొట్టారని ఆరోపిస్తూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు. గుర్రంపోడు మండలం వట్టికోడు గ్రామానికి చెందిన పొంగుబాల బ్రహ్మయ్య అతని కుటుంబసభ్యులు తరచూ తనను తిట్టడమేకాక తనతో గొడవ పెట్టుకుని కొట్టారని అతని ఎదురింట్లో ఉంటున్న మహిళ మారపాక కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

ఉత్తమ ప్రతిభ.. మాడ్గులపల్లి: విద్యార్థుల్లో దాగివున్న కళలను వెలికి తీయటానికి నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో మండల పరిధిలోని కుక్కడం(వేములపల్లి) విద్యాలయానికి చెందిన విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబర్చింది. పదోతరగతికి చెందిన డి.రేణుక సంప్రదాయ కథలు చెప్పటంలో మొదటి స్థానంలో నిలవటంతో, రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

బియ్యం పట్టివేత.. మిర్యాలగూడ పట్టణం: అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మిర్యాలగూడ రెండో పట్టణ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కిరాణ దుకాణం యజమాని చెదురుపల్లి సైదులు.. తన ఇంటి నుంచి పీడీఎస్ బియ్యాన్ని వాహనంలో తరలించేందుకు సిద్ధపడగా.. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

త్రిపురారం: మండల విద్యుత్తు అధికారిగా శుక్రవారం **అడావత్ బాలునాయక్** బాధ్యతలు చేపట్టారు. ఈయన హాలియా నుంచి బదిలీపై ఇక్కడికి రాగా ఇక్కడ పని చేసిన రవీందర్‌రెడ్డి బదిలీపై మిర్యాలగూడకు వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారికి, బదిలీపై వెళ్లిన అధికారికి ఎస్టీ యూనియన్ తరపున, లైన్‌మెన్లు మోతీలాల్, శ్రీను నాయక్, కొండల్‌నాయక్, శంకర్‌నాయక్, సైదానాయక్‌లు ఘనంగా శాలువాలతో సన్మానించారు.



సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్
విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక

ధరలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలను విస్మరిస్తూ.. కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ ధరలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని జప్తీవీరప్పగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీసీ బ్యాంకులో ఉన్న నల్లధనాన్ని బయటకు తెచ్చి జన్‌ధన్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, సీనియర్ నాయకులు రామ్మూర్తి, పిల్లుట్ల సైదులు, రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, రామకృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కలెక్టర్‌కు వినతి

చందంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం గ్రామ సభ ద్వారా ఏర్పాటు చేయాల్సిన ఇందిరమ్మ కమిటీని అధికార పార్టీ నాయకులు, అధికారులు ఏకపక్షంగా చేశారని, అట్టి కమిటీని రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామసభ నిర్వహించకుండానే 28 గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు జరుపుల లోక్యానాయక్, రాజవర్ధన్‌రాజు, తర్రి గోవర్ధన్‌లు కోరారు.